

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కోలగట్ల, బడ్డుకొండ

జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన కోలగట్ల, బడ్డుకొండ, పెనుమత్స

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర పార్టీ ముఖ్య నాయకుల సమావేశం అనంతరం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రత్యేకంగా కలిసి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులపై చర్చించారు.

- విజయనగరం/నెల్లిమర్ల రూరల్



మాజీ సీఎం జగన్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పెనుమత్స

క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌ను కలిసిన మహంతి



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మహంతి

పూసపాటిరేగ : వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు మహంతి జనార్ధనరావు తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులపై జగన్‌మోహన్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో పార్టీ పటిష్టానికి కృషి చేయాలని సూచించారు.

కారుతున్న వ్యవసాయ శాఖ కార్యాలయం



వ్యవసాయ కార్యాలయంలో లీకువుతున్న భవనం

విజయనగరం ఫోర్ట్: కలెక్టరేట్‌లో ఉన్న జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలోని భవనాలు లీకులు ఏర్పడడంతో చిన్నపాటి వర్షానికి కారిపోతుంది. దీంతో అధికారులు క్రింద నీటిలోనే విధులు నిర్వహిస్తున్నారు. పెద్ద వర్షం పడితే పరిస్థితి ఎంత ఘోరంగా ఉంటుందోనని అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు తగు చర్యలు చేపట్టాలని ఉద్యోగులు కోరుతున్నారు.

వ్యక్తిపై కేసు



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో సీఐ రవికుమార్, సిబ్బంది

భోగాపురం: మండలంలోని పెద్ద కొలువాడ బెల్టు దుకాణంపై ఎక్సైజ్ సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం దాడులు నిర్వహించారు. అనధికారికంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని 9 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఎక్కడైనా బెల్టు షాపులు నిర్వహిస్తే తమకి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బంది ప్రతాప్, ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామ సర్వేయర్ల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సర్వేయర్లు

నెల్లిమర్ల: సచివాలయ వ్యవస్థలో క్లస్టర్ విధానాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గ్రామ సర్వేయర్లు బుధవారం ఆందోళన చేపట్టారు. ఆ విధానం వల్ల సర్వేయర్ పోస్టులు తగ్గిపోవటమే కాకుండా పనిఒత్తిడి పెరుగుతుందన్నారు. ప్రమోషన్స్ కూడా సక్రమంగా ఉండవని ఆవేదన వ్యక్తం చేశారు. మిగులు సిబ్బంది భవిష్యత్‌పై ప్రభుత్వం వెంటనే సమగ్ర నివేదిక సమర్పించాలన్నారు. సర్వీస్ రూల్స్‌లో తగిన మార్పులు చేయాలన్నారు. సీనియారిటీ జాబితాను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.తమ సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని సర్వేయర్లు హెచ్చరించారు. కార్యక్రమంలో సర్వేయర్లు కె.దుర్గాప్రసాద్, టి.అశోక్, కె.సుహాస్ తదితరులు పాల్గొన్నారు.

జూట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న రాజేష్‌వర్మ

నెల్లిమర్ల: నెల్లిమర్ల జూట్ మిల్లు రిటైర్డ్ కార్మికుల గ్రాట్యూటీ సమస్య పరిష్కరించకుంటే ఆందోళన చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ వర్మ హెచ్చరించారు. పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు మైపాడ ప్రసాద్, రిటైర్డ్ కార్మికులతో కలిసి స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీకాంత్‌ను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్‌కోర్ట్ ఆదేశించినా మిల్లు యాజమాన్యం ఎందుకు గ్రాట్యూటీ చెల్లింపులు చేయలేదని ప్రశ్నించారు. ఈ విషయంలో గత తహసీల్దార్ పూర్తిగా నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. దీంతో వారంతా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సమస్య వెంటనే పరిష్కరించకుంటే కార్మికులతో కలిసి ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఆల్తి నల్లిబాబు, ఉపాధ్యక్షుడు కళ్యాణం బాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములపై ఆక్రమణదారుల కన్ను!

- దేవదాయ భూములను వదలని వైనం..!



గంట్లాం గ్రామంలో అక్రమంగా చదును చేసిన ప్రభుత్వ భూమి

డెంకాడ: మండలంలోని గంట్లాం గ్రామంలో కోట్లాది రూపాయిలు విలువ చేసే ప్రభుత్వ భూమిని అప్పనంగా కొట్టేందుకు కొందరు ఆక్రమణదారులు జేసీబీతో చదును చేస్తున్నారని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. గంట్లాం గ్రామంలో చాలా వరకు ప్రభుత్వ, దేవదాయ భూములు ఉన్నాయి. ఇదే అదునుగా కోట్లాది రూపాయిలు విలువ చేసే ప్రభుత్వ, దేవదాయ భూములను ఆక్రమించుకునే పనిలో అక్రమార్కులు ఉన్నారు. ప్రభుత్వ భూముల కబ్జాల్లో కొందరు గ్రామ, మండల నాయకుల ప్రోత్సాహం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాజాగా బుధవారం గంట్లాం గ్రామంలో ప్రభుత్వ భూమిని జేసీబీతో చదును చేస్తున్నారు. విషయం గమనించిన స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ రాజారావు రెవెన్యూ అధికారులను చదును చేస్తున్న స్థలం వద్దకు వెళ్లి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

చదును చేసినది ప్రభుత్వ భూమే...

ఇదే విషయమై వీఆర్‌వో శిరీష మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఎటువంటి అనుమతులు లేకుండా జేసీబీతో చదును చేస్తున్నారని తహసీల్దార్ రాజారావుకు పలువురు గ్రామస్తులు ఫిర్యాదు చేశారని తెలిపారు. దీనిపై తమను సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించాలని తమను ఆదేశించారన్నారు. దీంతో తాము చదును చేస్తున్న స్థలం సర్వే నంబరు 121 పార్ట్‌గా గుర్తించామన్నారు. ఇది రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగానే ఉందన్నారు. కొందరు తమ జిరాయితీ భూమి అని చెబుతున్నారని, తగిన ఆధారాలు తమ ముందు ఉంచాలని ఆదేశించామన్నారు. మేము వెళ్లే సరికే అక్కడ చదును చేస్తున్న యంత్రాలు వెళ్లిపోయాయని వీఆర్‌వో శిరీష సాక్షికి వివరణ ఇచ్చారు. ఎవరైనా అక్రమంగా ప్రభుత్వ భూమిలోకి చొరబడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని వీఆర్‌వో చెప్పారు.

కమిషనర్ క్షేత్ర పర్యటన



కార్పొరేషన్ పరిధిలోని వార్డు సచివాలయ కార్యదర్శులు విధిగా క్షేత్ర పర్యటనలు చేయాలని కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా బుధవారం కమిషనర్ నగర పరిధిలోని కంటోన్మెంట్, అంబేడ్కర్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య విధానాన్ని పరిశీలించారు. నిర్ణీత సమయానికి సిబ్బంది విధులకు హాజరవుతున్నారా.. లేదా.. అన్న విషయమై కార్యదర్శులు పరిశీలిస్తున్నారో.. లేదో.. గమనించారు. అనంతరం 49వ నంబరు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పౌర సేవలను నిర్ణీత కాలవ్యవధిలోనే అందజేయాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రణాళిక కార్యదర్శికి మెమో జారీ చేశారు. – విజయనగరం

జర్నలిస్టు మృతికి సంతాపం



రాజశేఖర్ సంతాప సభలో పాల్గొన్న జర్నలిస్టులు

విజయనగరం : చిన్న వయసులోనే వీడియో జర్నలిస్ట్ రాజశేఖర్ మృతి వారి కుటుంబానికి తీరని లోటని విజయనగరం జర్నలిస్టులు విచారం వ్యక్తం చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన రాజశేఖర్ సంతాప సభలో పాల్గొన్న పౌర సంబంధాల శాఖ అధికారులు, సీనియర్ పాత్రికేయులు, వీడియో జర్నలిస్టులు, ఇతరులు రాజశేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాజశేఖర్ ఆత్మ శాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో పౌర సంబంధాలు శాఖ జిల్లా అధికారి మల్లేశ్వరరావు, సీనియర్ పాత్రికేయులు బి. శ్రీనివాసరావు, వీడియో జర్నలిస్టు కాళ్ళ శ్రీనివాస్, డి.సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో పర్యటించాలి

- ప్రణాళికా కార్యదర్శులను ఆదేశించిన కమిషనర్



సమావేశంలో మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్

విజయనగరం: అనుమతులు లేని నిర్మాణాలు, అక్రమ కట్టడాలను గుర్తించేందుకు నిరంతరం క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని ప్రణాళికా కార్యదర్శులను విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర క్రమబద్ధీకరణలో ప్రణాళిక కార్యదర్శులదే కీలక భూమికని అన్నారు. ప్రతిరోజు ఉదయం క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేపడుతూ అక్రమ నిర్మాణాలు, కట్టడాలను గుర్తించి వెంటనే నిలుపుదల చేయాలని చెప్పారు. అలాగే రహదారులపై భవన వ్యర్థాలు, ఇసుక, పిక్క వంటివి ఉండకుండా చూడాలన్నారు. ప్రణాళికాబద్ధమైన నగర నిర్మాణానికి మరింత కృషి చేయాలని చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, టీపీఓ అప్పలరాజు, టీపీఎస్ అనిత పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లిమర్ల రూరల్: విద్యుత్ లైన్ల నిర్వహణ కారణంగా మండలంలోని పలు గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆ శాఖ డీఈఈ పి.త్రినాథరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండవెలగాడ సబ్‌స్టేషన్ పరిధిలోని పారసాం, గెద్దపేట, చిన్న బూరాడపేట, పెద్ద బూరాడ పేటతో పాటు గుర్ల మండలంలో ఆనందపురం గ్రామానికి ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరుకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ ఏర్పాటు

నెల్లిమర్ల: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ) నూతన అభివృద్ధి కమిటీ ఏర్పాటైంది. కమిటీ చైర్‌పర్సన్‌గా ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, సభ్యులుగా దుర్గాసి శేఖర్, మజ్జి రాంబాబును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, నగర పంచాయతీ కమిషనర్ తారక్‌నాథ్, ఎంపీడీవో రామకృష్ణరాజు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఆల్తి విజయశాంతి మెంబర్లుగా ఉంటారు. ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ గీతాభవానీ మెంబరుగా, కమిటీ కన్వీనరుగా కొనసాగుతారు. ఈ నెల 26న మంగళవారం ఆసుపత్రి కమిటీ మొట్టమొదటి సమావేశం జరగనుందని సంబంధిత అధికారులు తెలిపారు.

నేటి నుంచి నట్టల నివారణ మందు

డెంకాడ: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు ఈ నెల 26వ తేదీ నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకూ ఉచితంగా వేయడం జరుగుతుందని అక్కివరం పశువైద్యాధికారి శ్రీకాంత్ తెలిపారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో రైతులు తమ గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేయించుకోవాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో జగన్నాథునికి క్షీరాధివాసం



జగన్నాథస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం టౌన్: స్థానిక సంతపేట జగన్నాథ స్వామి ఆలయంలో స్వామి వారి రథయాత్ర మహోత్సవాల్లో భాగంగా బుధవారం క్షీరాధివాసం నిర్వహించారు. ఆలయ అర్చకులు అనంత వెంకట జగన్నాథాచార్యస్వామి, పవన్‌కళ్యాణ్ స్వాములు స్వామివారికి ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 26న గురువారం ఉదయం 6.15 గంటల నుంచి స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కళా ఆవాహన, బింబ దర్శనం, నేత్రోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. 27న శుక్రవారం స్వామివారి తొలి రథయాత్ర ప్రారంభమవుతుందన్నారు. భక్తులందరూ ఉత్సవంలో పాల్గొని స్వామిని దర్శించి తరించాలని కోరారు.

మాజీ సైనికుల సమస్యలు పరిష్కరించాలి



జిల్లా సైనిక సంక్షేమాధికారి ప్రసాదరావుకు వినతి పత్రం ఇస్తున్న సంఘం ప్రతినిధులు

విజయనగరం టౌన్: మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించాలని నేతాజీ మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెద్దింటి గుణాకరరావు పేర్కొన్నారు. జిల్లా సైనిక సంక్షేమాధికారి కెవిఎస్.ప్రసాదరావును సంఘం ప్రతినిధులు బుధవారం ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. దీర్ఘకాలిక సమస్యలను తొందరగా పరిష్కరించి, మాజీ సైనికులందరికీ సమన్యాయం జరిగేలా చూడాలని కోరారు. అమరవీరుల స్థూపం ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రతినిధుల రామారావు, చలుమూరు రామారావు, ఓఎస్‌సీ రావు, ఎం.రామకృష్ణ, నిమ్మల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి మోడల్ స్కూల్ విద్యార్థులు



పతివాడ హిమవర్ష | కశింకోట రాఘవేంద్ర | రొంగలి లాస్యశ్రీ | తోరోతు అంజలి

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీలోని గొల్లపేట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌కి చెందిన నలుగురు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. పదో తరగతిలో 588 మార్కులు సాధించిన పతివాడ హిమవర్షకు, 582 మార్కులు సాధించిన కశింకోట రాఘవేంద్రకు నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీట్లు వచ్చాయి. 578 మార్కులు సాధించిన రొంగలి లాస్యశ్రీకు శ్రీకాకుళం ట్రిపుల్ ఐ టీలోను, 572 మార్కులు సాధించిన తోరోతు అంజలి ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

మురుగు నిల్వ ఉండకుండా చర్యలు

- జిల్లా పంచాయతీ అధికారిణి శిరీష



కొండగుంపాంలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

నెల్లిమర్ల రూరల్: గ్రామాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీఎల్‌పీవో శిరీష సూచించారు. మండలంలోని కొండగుంపాంలో బుధవారం పర్యటించి ఇంటింటా చెత్త సేకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడాతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రత్యేక పారిశుధ్య పనులపై సిబ్బంది దృష్టి సారించాలన్నారు. కాలువల్లో మురుగు నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. ప్రజలు కూడా పారిశుధ్య కార్మికులకు సహకరించాలని, చెత్తను కాల్వల్లో వేయకుండా కార్మికులకు అందజేయాలన్నారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా బుట్టల్లో వేసుకోవాలని సూచించారు. తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి ప్రజలకు సురక్షిత మంచి నీటిని అందజేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ సుదర్శన్ పట్నాయక్, సర్పంచ్ పతివాడ అప్పన్న, ఈవోపీఆర్డీ శంకర జగన్నాథం, కార్యదర్శి ఎల్.తవుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంయూ ఉద్యమ విజయానికి అభినందన



విజయానందంలో ఎన్ఎంయూ కార్మికులు

విజయనగరం అర్బన్: ఆర్టీసీ ఎన్ఎంయూ ఆధ్వర్యంలో జోనల్ స్థాయిలో గత ఆరు నెలలుగా కొనసాగిన కార్మిక ఉద్యమానికి విజయపూరిత ముగింపు లభించిందని సంఘం జిల్లా కమిటీ కార్యదర్శి పీజీ రాఫెల్ అన్నారు. స్థానిక డిపో ఆవరణలోని సంఘం కార్యాలయంలో బుధవారం జరిగిన అభినందన సభలో ఈ మేరకు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్ స్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై పలుమార్లు ఉద్యమాలు చేసినా యాజమాన్యం స్పందించకపోవడంతో చివరి అస్త్రంగా సమ్మె నోటీసు ఇచ్చామని తెలిపారు. అంతకు ముందు దానికి ముందు ఎర్ర బ్యాడ్జ్ ధరించడం, గేట్ ధర్నాలు, రిలే నిరాహార దీక్షలు, చలో డిపో కార్యాలయం వంటి కార్యక్రమాలు నిర్వహించామని గుర్తు చేశారు. విజయనగరం జోన్ ఈడీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బ్రహ్మానందరెడ్డి చూపిన చొరవతో పలు సమస్యలు పరిష్కారం అయ్యాయని అన్నారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి చంద్రమౌళి, జిల్లా జాయింట్ సెక్రటరీ ఎం.కృష్ణ, గ్యారేజ్ అధ్యక్ష, కార్యదర్శులు కేవీఆర్ రాజు, గోపి, మహిళా ప్రతినిధులు రూపవతి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాముల తనిఖీ



ఈవీఎం గోదామును తనిఖీ చేస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

నెల్లిమర్ల: స్థానిక ఈవీఎం గోదాములను కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బుధవారం తనిఖీ చేశారు. గోదాము షట్టర్లకు, లోపలి గదులకు వేసిన సీళ్లను, తాళాలను తీయించి, లోపల ఉన్న ఈవీఎం ట్రంకు బాక్సులను తనిఖీ చేశారు. అనంతరం సీళ్ల వేయించారు. సీసీ కెమెరాలను పరిశీలించారు. అక్కడ భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. అప్రమత్తంగా ఉండాలని అధికారులను, పోలీసు సిబ్బందిని ఆదేశించారు. డీఆర్‌వో ఎస్.శ్రీనివాసమూర్తి, ఇంచార్జ్ ఆర్‌డీవో టి.సవరమ్మ, నెల్లిమర్ల తహసీల్దార్ శ్రీకాంత్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ భాస్కర్‌రావు, ఇతర సిబ్బందితో పాటు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

హేతుబద్ధీకరణ పేరిట బదిలీలు ఆపేయాలి

పూసపాటిరేగ : సచివాలయాలలో పని చేస్తున్న సర్వేయర్లకు హేతుబద్ధీకరణ పేరిట ప్రభుత్వం చేయబోయే బదిలీలు నిలుపుదల చేసి గ్రామాలలో రీసర్వే పూర్తయిన తరువాత మెరిట్ ఆధారంగా కౌన్సెలింగ్ చేసి బదిలీ చేయాలని సర్వేయర్ల అసోసియేషన్ నాయకులు వెంపడాపు కాశినాయుడు, రౌతు జనార్ధనరావు డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నంబరు 4, 5 ప్రకారం సుదూర ప్రాంతం బదిలీ చేస్తే వీఎస్ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడతారన్నారు. స్థానిక మండలంలో విధులు నిర్వర్తించడానికి జీవో సవరణ చేయాలన్నారు. హేతుబద్ధీకరణ కోసం కమిటీని వేసి రిపోర్టు ఆధారంగా నిర్ణయం తీసుకోవాలన్నారు. రీసర్వే ప్రారంభమైనప్పటి నుంచి వీఎస్‌లను 8 కిలోమీటర్లు పైబడి విధులకు వినియోగించారని పేర్కొన్నారు. దీనికి సంబంధించి టీఏ, డీఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్వేయర్లు కుమార్, పావని, రమణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.



మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సర్వేయర్లు